క్లుప్తంగా

ఆక్రమణకు గురైన చెరువు భూమి పరిశీలన

నాదెండ్ల: చిరుమామిళ్ళ గ్రామంలో ఆక్రమణలకు గురైన చెరువు భూమిని శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి, మండల సర్వేయర్ రాంబాబు, విలేజ్ సర్వేయర్ ఉష, పంచాయతీ కార్యదర్శి ఠాగూర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో వివరాలు నమోదు చేసుకున్నారు. చెరువు భూమిలో నిర్మించిన గదులను స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించాలన్నారు. దానిపై వచ్చే అద్దె ఆదాయాన్ని పంచాయతీ నిధులకు జమ చేయాలని స్థానికులు కోరారు. నివేదికను జాయింట్ కలెక్టర్‌కు పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

నష్టపోయిన వారిని ఆదుకోవాలి

ఈపూరు : మండలంలోని ఊడిజర్ల గ్రామంలో నందీశ్వర కంపెనీ బీబీటీ వెరైటీ వరివిత్తనాల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు జిల్లా ప్రధానకార్యదర్శి ఉలవలపూడి రాము మాట్లాడుతూ ఊడిజర్ల గ్రామంలో నందీశ్వర కంపెనీ బీబీటీ వెరైటీ వరి విత్తనాలను వందలాది ఎకరాల్లో సాగు చేయడం జరిగిందని, అయితే సగానికి పైగా కేళీలు రావడంతో విత్తనాల షాపు యజమానులకు చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. రైతుల పక్షాన నిలబడి రైతులకు న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

కొండ్రముట్ల ప్రభుత్వ కార్యాలయాల్లో దొంగతనం

ఈపూరు: మండలంలోని కొండ్రముట్ల గ్రామసచివాలయం, రైతు సేవా కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో దొంగలు గురువారం రాత్రి పడి పలు పరికరాలను దోచుకెళ్లారు. ఉదయం సిబ్బంది వెళ్లేసరికి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని చూసి ఆయా కార్యాలయాల్లో ఉన్న ల్యాప్‌టాప్, కంప్యూటర్లు, బ్యాటరీలు తీసుకెళ్లినట్లు గుర్తించారు. అలాగే బీరువాలను పగలగొట్టి వాటిలోని ఫైల్స్‌ను చిందవందరగా పడేసి ఇతర పరికరాలను అపహరించారు. అలాగే రైతు సేవా కేంద్రంలో ఉన్న ప్రింటర్, డిజిటల్ మిషన్ తదితర వాటిని అపహరించినట్లు సచివాలయ సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు ఈపూరు ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు సంఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

ఈపూరు: ఉమ్మడిగుంటూరు జిల్లా మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మండల కేంద్రమైన ఈపూరులో శుక్రవారం కరపత్రాలను ఎంఆర్‌పీఎస్ నాయకులు పంపిణీ చేశారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 19న జరిగే ఈ సమ్మేళానికి విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు, సామాజిక న్యాయాన్ని కోరుకునే ప్రజలందరూ వేలాదిగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు.

శావల్యాపురం బోడ్రాయి వీధిలో చోరీ

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో ప్రధాన కూడలీ మార్గంలో బోడ్రాయి వీధిలో చోరీ జరిగిన సంఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దురిశెల సత్యనారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి ఈనెల 1వ తేదీన వెళ్లాడు. ఈక్రమంలో ఇంటిని శుభ్రపరిచేందుకు గాను రోజువారిగా ప్రత్యేకంగా పనిమనిషిగా ఉంచారు. రోజువారి విధుల్లో భాగంగా బయట ఉన్నటువంటి గేటు తీసి లోపలికి వెళ్ళటానికి చూడగా ఒక్కసారిగా ప్రధాన ద్వారం తాళం పగులకొట్టి ఉండటం చూసి చుట్టుపక్కల నివాసాల వారందరిని పిలిచి విషయాన్ని చెప్పింది. ఈవిషయాన్ని సెల్‌ఫోను ద్వారా దురిశెల సత్యనారాయణ సమాచారాన్ని తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు పల్నాడు జిల్లా క్యూస్ టీం పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వేలుముద్రలు సేకరించారు. కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలన్నీ పోలీసులు నమోదు చేసుకున్నారు. బంగారు చైను లాకెట్లు-02, చెవిదిద్దులు రెండు జతలు, వెండి వస్తువులు చోరీ జరిగినట్లు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు లిఖిత పూర్వకంగా తెలిపారు. ఈఏడాది సెప్టెంబరు నెలలో ఇదే వీధిలో రోడ్డుపై పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురికావటం విశేషం.

టెన్నిస్ జట్ల ఎంపిక

నరసరావుపేట రూరల్: కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూకే వర్సిటీ పురుషుల, మహిళల టెన్నిస్ జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎంపికలకు ఐసీటీ జేఎన్‌టీయూకె కార్యదర్శి, అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ ఫిజికల్ ఎడ్యూకేషన్ డాక్టర్ జీపీ రాజు హాజరయ్యారు. పలు కళాశాలల నుంచి 15 మంది క్రీడాకారులు ఎంపికలలో పాల్గొన్నారు. ఐదుగురు సభ్యులతో పురుషుల జట్టుకుఎంపిక చేశారు. మహిళలు ఇద్దరు మాత్రమే పోటీలకు హాజరు కావడంతో జట్టు ఎంపికను నిలిపివేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22వ తేదీ 26వ తేదీ వరకు తిరువనంతపురం యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగే సౌత్ జోన్ పోటీలలో వర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి షేక్ కరీమ్ మోహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ హెచ్.గంగాధరరావు, వ్యాయామ అధ్యాపకుడు లక్కిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బాబోయ్ దోమలు !



- నరసరావుపేటలో ఇళ్లల్లో రేయింబవళ్లు దోమల సంచారం
- సిబ్బంది అధికంగా ఉన్నా నిరోధించలేని వైనం
- రోడ్లకు ఇరువైపులా ఉన్న సైడు డ్రెయిన్ల నిర్వాహణ లోపం
- సమర్థంగా పారిశుద్ధ్యం నిర్వహిస్తున్నామని నేతల బడాయి!



రాత్రి సమయంలో పట్టణంలో ఫ్యాగింగ్ చేస్తున్న దృశ్యం



ప్రకాష్‌నగర్ సప్తపది కల్యాణ మండపం సమీపంలోని డ్రెయిన్‌లో మురుగునీరు నిల్చిన దృశ్యం

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పురపాలక పరిధిలో దోమల విజృంభణ ఎక్కువగా ఉంది. దీనివల్ల రాత్రిళ్లతో పాటు పట్టపగలు కూడా ఇళ్లల్లో నిత్యం దోమల మోత మోగుతుంది. అపార్టుమెంట్లలోని పై ప్లాట్స్‌లో కూడా సాయంత్రం ఐదు గంటల నుంచి తలుపులు, కిటీకీలు మూసుకొని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ బస్టాండ్ లాంటి ప్రదేశాల్లో తేనెటీగల్లా ముసురుతున్నాయి. దోమల పుట్టుక, పెరుగుదలకు ఎక్కువగా అవకాశం ఉండే రోడ్లపక్కనున్న సైడు డ్రెయిన్లులో మురుగునీరు నిల్చి ఉండటమే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. దీంతో పాటు వర్షాలు అధికంగా కురవటం, వాతావరణం చల్లగా ఉండటం వలన దోమల ఉధృతి అధికంగా కన్పిస్తోంది. మురుగునీటిలో దోమల పెరుగుదలను లార్వాల దశలోనే నిర్మూలించేందుకు ఎప్పటికప్పుడు మలాథియాన్ ద్రావణం కిరోసిన్ లేదా పెట్రోలులో కలిపి పిచికారీ చేయాల్సి వుంది. అయితే ఆ మందు వారానికి ఒకసారి లేదా పదిహేను రోజులకు ఒకసారి చేస్తున్నారు. దీంతో పాటు దోమలను పారద్రోలేందుకు రాత్రి సమయంలో నిత్యం ఫాగింగ్ చేయాల్సి ఉండగా వార్డుల వారీగా వారానికి ఒకసారి ఒక వార్డు చొప్పున నిర్వహిస్తున్నారు.

34 వార్డుల్లో 290 కిలోమీటర్ల డ్రెయిన్లు

పట్టణంలో 34 వార్డుల్లో 33 వేల గృహాలు ఉండగా, వాటిలో సుమారుగా 1.40 లక్షలమంది జనాభా నివాసం ఉంటున్నారు. సుమారు 250 వరకు అపార్టుమెంట్లు ఉన్నాయి. దీంతో పాటు పట్టణ పరిధిలో జనవాసాల మధ్య మురుగునీటిని తరలించే 290 కిలోమీటర్ల పొడవైన పక్కా, కచ్చా డ్రెయిన్లు, స్ట్రామ్ వాటర్, కచ్చా స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు ఉన్నాయి. ప్రతిరోజూ పారిశుద్ధ్య నిర్వహణలో 260 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులతో పాటు 67 మంది శాశ్వత కార్మికులు పాల్గొంటున్నారు. రాత్రి, పగలు పారిశుద్ధ్య నిర్వహణ చేస్తున్నారు. అయినప్పటికీ దోమలను నియంత్రించటం పూర్తిగా సాధ్యంకాకపోయినా కనీసం వాటి ఉధృతిని తగ్గించలేకపోతున్నారు.

దోమలు కుడితే....

దోమలు కుట్టడం వలన చికున్‌గున్యా, మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, విష జ్వరాలు వస్తున్నాయి. చికున్ గున్యా ఒకసారి వచ్చి తగ్గినా దీని ద్వారా వచ్చే కీళ్ల నెప్పులు నెలల తరబడి అనుభవించాల్సి ఉంటుంది. డెంగ్యూ వచ్చి రక్తంలోని ప్లేట్‌లెట్స్ పడిపోతే మరణాలు సంభవించటం, అవి మళ్లీ పునరుద్ధరించుకునేందుకు వేలరూపాయల ఖర్చును భరించాల్సి ఉంది. ఫైలేరియా వస్తే అవయవాలు షేప్ మారిపోతాయి. విషజ్వరాలు తగ్గించుకునేందుకు వేలాది రూపాయలు ప్రైవేటు హాస్పిటళ్లకు కుమ్మరించాల్సిన పరిస్థితి ప్రజలకు నెలకొంది.

ప్రతిరోజూ నేతలు, అధికారులు ఎక్కడో ఒకచోట పారిశుద్ధ్య తీరును పరిశీలిస్తూ శానిటేషన్ అధికారులు, మేస్త్రీలు, కార్మికులకు పలు సూచనలు చేస్తున్నా ఫలితం కన్పించటం లేదు. దీనికి కారణం సైడు డ్రెయిన్లలో మురుగునీరు సక్రమంగా పారకపోవటమే. అంతేగాకుండా ప్రతిరోజూ వార్డుల వారీగా డ్రెయిన్ శుభ్ర నిర్వాహణ చేయటంలేదు. వారానికి ఒకసారి లేదా 15 రోజులకు ఒకసారి డ్రెయిన్ల శుభ్రం చేస్తున్నారు. దీనివల్ల దోమలు పెరుగుతున్నాయి.

> **నిత్యం చర్యలు తీసుకుంటున్నాం**
>
> పట్టణంలోని పారిశుద్ధ్య నిర్వహణ బాగుకోసం నిత్యం శ్రద్ధ తీసుకుంటున్నాం. దోమల నివారణకు డ్రెయిన్లలో మలాతియాన్ మందు పిచికారీతో పాటు ఫాగింగ్ చేస్తున్నాం. ఫాగింగ్ చేసేందుకు ఆరు మిషన్‌లు ఉండగా రోజూ ఆరు వార్డుల్లో ఫాగింగ్ నిర్వహిస్తున్నాం. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ సూచనల మేరకు పారిశుద్ధ్య నిర్వహణ కోసం పాటుపడుతున్నాం.
>
> –రామకోటయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్

18న మద్యం దుకాణాల ఫర్నీచర్ వేలం

నరసరావుపేటటౌన్: మద్యం దుకాణాల్లో వినియోగించిన ఫర్నీచర్‌ను ఈ నెల 18న వేలం వేయనున్నట్లు ఐఎంఎల్ డిపో మేనేజర్ జి.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాల్లోని టేబుల్స్, ఇన్వాటర్ బ్యాటరీ, క్యాష్ కౌటింగ్ మిషన్, ఐరన్ ర్యాక్ తదితర ఫర్నీచర్‌ను స్టేట్ బెవేరుజెస్ కార్పోరేషన్ లిమిటెడ్ ఆదేశాలతో బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల డీమార్ట్ ఎదుట స్టేట్ వేర్ హౌసింగ్ కార్పోరేషన్ గోదాంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు నిర్దేశించిన రూ.5 వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

హెచ్ఐవీ బాధితులకు షుగర్, బీపీ పరీక్షలు ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): హెచ్ఐవీతో జీవిస్తూ ఏఆర్‌టీ మందులు వాడే వారికి షుగర్, బీపీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వినుకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ రజాక్ కోరారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వినుకొండ లింక్ ఏఆర్‌టీ సెంటర్ నందు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, నాన్ కమ్యూనికబుల్ డిసీజ్, సీడీసీ, పెప్ఫార్, షేర్ ఇండియా సహకారంతో షుగర్, బీపీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ రజాక్ మాట్లాడుతూ షుగర్, బీపీ స్థితి తెలుసుకోవడం ద్వారా సకాలంలో మందులు వాడి దుష్ప్రభావాలను నివారించవచ్చని తెలిపారు. ఐసీటీసీ కౌన్సిలర్ కొండేపాటి సురేష్ మాట్లాడుతూ ప్రతి నెలా 15వ తేదీ వైరల్ లోడ్ పరీక్షతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు జరుపుతున్నట్లు, ప్రతి రోజూ పరీక్షలు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ డి.సి అజయ్, చిరంజీవి, కె.సురేష్, ల్యాబ్ టెక్నీషియన్, రోజా, అంజిరెడ్డి, వాసవి, శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలకు శావల్యాపురం బాలికలు



వేముల దివ్య



ఆకుమళ్ళ సమీరా



ముక్కపాటి లిఖిత

శావల్యాపురం: జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో సీనియర్ మహిళల విభాగంలో ముగ్గురు విద్యార్థినులు ఎంపికై నట్లు శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సీనియర్ మహిళల విభాగంలో పాఠశాల పూర్వ విద్యార్థి ముక్కపాటి లిఖిత (కనమర్లపూడి) క్రీడా కోటాలో ఎస్ఆర్‌యం యూనివర్సిటీ బీటెక్ ఫైనల్ ఇయర్ ఉచితంగా విద్యను అభ్యసిస్తోందన్నారు. ఈవిద్యార్థి సీనియర్స్ మహిళ విభాగంలో వచ్చే నెలలో జరగనున్న జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాపోటీల్లో మహారాష్ట్రలోని ముంబైలో జరిగే పోటీలో డిసెంబరు నెలలో పాల్గొంటుందన్నారు. వేముల దివ్య (ఇంటర్ ఫస్ట్ ఇయర్) ఆకుమళ్ల సమీరా (సీనియర్ ఇంటర్)లు సీనియర్ మహిళల ఫెడరేషన్ కప్‌కు ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. సీనియర్ మహిళల విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్టు తరుపున క్రీడాకారులు ముట్లూరి లూథియా, కామినేడి కావ్య, వేముల దివ్య, బండారు రవళి, బండారు దేవమణి, ఓర్సు స్రవంతి, ఆకుమళ్ళ సమీరా, ఆర్.రత్న కీర్తన, ఉప్పు బసవరాణి పూర్వ విద్యార్థి (ట్రిబుల్ ఐటీ నూజివీడు)లు త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ చూపి పాఠశాలకు, గ్రామానికి మంచిపేరు తేవాలని పీడీ రాగుల రాధా కృష్ణమూర్తి అన్నారు.

శావల్యాపురం వాసికి సైబర్ బెదిరింపులు

శావల్యాపురం: సైబర్ నేరగాళ్లు రోజుకో అవతారంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన కాకాని నారాయణకు సీబీఐ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఓ వ్యక్తి వాట్సప్ కాల్ చేశాడు. నీకూతురు అమెరికాలో ఉందని, డ్రగ్స్ కేసులో పట్టుబడిందని మాటల్లో దించాడు. అదే సందర్భంలో నీ కూతురుతో మాట్లాడతావా అని అడగ్గా నారాయణరావు ఇవ్వండి మాట్లాడుతానన్నాడు. అవతలి వ్యక్తి ఆడపిల్ల ఏడుస్తున్నట్లుగా శబ్దాలు, పోలీస్ సైరన్లు వినిపించాడు. మరికొద్దిసేపట్లో కేసు నమోదు చేస్తారని, 20 సంవత్సరాల పాటు జైలు శిక్ష పడుతుందని సైబరు నేరగాళ్ల బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈక్రమంలో తాము కేసు లేకుండా చేస్తామంటూ బేరసారాలు ప్రారంభించి గూగుల్‌పే ద్వారా తక్షణమే రూ. 50 వేలు పంపించండి అంటూ హిందీ, ఆంగ్ల భాషలో సైబరు నేరగాడు డిమాండ్ చేశాడు దీంతో సత్వరమే అమెరికాలో ఉన్న తన కూతురుకు వాట్సాప్ కాల్ చేయగా ఇదంతా ఫేక్ న్యూస్ అని, చెప్పడంతో ఊపిరి పిల్చుకున్నారు.

సహకార సంఘం వారోత్సవాలు

ఈపూరు: స్థానిక సహకార సంఘంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆఫిషయల్ పర్సన్ ఇన్‌చార్జి నర్రా సురేంద్రబాబు సంఘంలో ఉన్న ప్రతి రైతుకు ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని, వినియోగించుకోవాల ని కోరారు. త్వరలో కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేసి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేవరకు నిల్వ చేసుకునే విధంగా చూస్తామన్నారు. సొసైటీ ద్వారా జనరిక్ మెడికల్ షాపు, కామన్ సర్వీస్ సెంటర్లను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ పి.వెంకటేశ్వర్లు, సీఈవో పోకా కోటేశ్వరరావు, బొల్లా సుబ్బయ్య, రాపర్ల మురళీ, బెల్లంకొండ సైదులు, ముద్దా నాగలక్ష్మయ్య, గోవిందు, సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్టింగ్‌లపై ఫిర్యాదు

నరసరావుపేట: ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టారంటూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.అలెగ్జాండర్ సుధాకర్ శుక్రవారం రాత్రి ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. పోస్టింగ్‌లకు కారణమైన వారితోపాటు మరో ఇద్దరిపై తగు చర్యలు తీసుకోవాలని మహిళా ఎస్‌ఐకు ఫిర్యాదు అందజేశారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

సైలెన్సర్ వల్ల..

ద్విచక్రవాహనం సైలెన్సర్ అంటుకుని దుస్తుల బ్యాగు దగ్ధమైన ఘటన శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. తెనాలికి రమేష్ తన బజాజ్ ప్లాటినా ద్విచక్రవాహనంపై ఇరువురు కుటుంబ సభ్యులతో కలిసి వినుకొండకు బయలుదేరాడు. సాయంత్రం 4 గంటల సమయానికి చిలకలూరిపేట బస్టాండ్ సమీపానికి చేరుకునే సరికి వాహన సైలెన్సర్ హీట్ ఎక్కి దానికి ఆనుకుని ఉన్న దుస్తుల బ్యాగులో మంటలు చెలరేగాయి. ఇది గమనించి ద్విచక్రవాహనాన్ని నిలిపి దుస్తుల బ్యాగు మంటలను ఆర్పారు. బ్యాగులోని విలువైన పట్టుచీరలతో సహా దుస్తులు మంటల్లో దెబ్బతిన్నాయి. –నాదెండ్ల



పల్లెపండుగ పనులు పారదర్శకంగా చేపట్టాలి

పంచాయతీ రాజ్ శాఖ జాయింట్ కమిషనర్ జె.సునీత

శావల్యాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పల్లెపండుగ కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు పారదర్శకంగా జరిగేలా క్షేత్రస్థాయిలో నిరంతరం అధికారులు పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ జాయింట్ కమిషనర్ జె.సునీత అన్నారు. శుక్రవారం పల్నాడు జిల్లా శావల్యాపురం మండలంలోని ఇర్లపాడు, ముండ్రువారిపాలెం గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. జాయింట్ కమిషనర్ సునీత మాట్లాడుతూ ఉపాధి కూలీల కార్డులను తనిఖీ చేసి మృతి చెందిన వారి జాబ్ కార్డులను తొలగించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో జాబ్‌కార్డు కల్గి ఉన్న వారందరి సమగ్ర వివరాలను ప్రధాన కూడలి మార్గాల్లో ప్రచురించాలన్నారు.



పనులను పరిశీలిస్తున్న సునీత

ప్రైవేటు స్కూలు బస్సును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఇరువురు విద్యార్థులకు గాయాలు

నాదెండ్ల: గుంటూరు-కర్నూలు రాష్ట్రీయ రహదారి సాతులూరు వద్ద ప్రైవేటు స్కూలు బస్సును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. ఇరువురు చిన్నారులకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నరసరావుపేట గీతాంజలి ప్రైవేటు స్కూలు బస్సు విద్యార్థులను ఎక్కించుకుని నరసరావుపేట నుంచి సాతులూరు వైపుకు వస్తున్నది. ఈ క్రమంలో నరసరావుపేట ఆర్టీసీ డిపోకు చెందిన నాన్‌స్టాప్ బస్సు ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూలు బస్సులోని ఇరువురు చిన్నారులు గాయాలపాలయ్యారు. పెను ప్రమాదం తప్పటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



సాతులూరు వద్ద ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

రేపు నిదానంపాటి అమ్మవారి తిరునాళ్ల

శావల్యాపురం: మండల కేంద్రంలో వేంచేసియున్న శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి పుట్ట తిరునాళ్ళ వేడుకలు ఆదివారం నుంచి గ్రామస్తులు దాతలు సహకారంతో వైభవంగా నిర్వహించుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మద్దినేని హరిబాబు వెల్లడించారు. గత 44 సంవత్సరాల నుంచి ఘనంగా జరుపుతున్నామన్నారు. ఆదేరోజు ఉదయం భజన కార్యక్రమాలు సాయంత్రం కోలాటం బృందం సభ్యులచే ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తిరునాళ్ల పర్వదినం రోజున జలబిందెల కార్యక్రమంలో పాల్గొనే బాలికలు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూజారీ సాయి భరత్ సారధ్యంలో పూజలు నిర్వహిస్తారన్నారు.

హరోంహర.. మహాదేవ!

ఆలయాల్లో కార్తిక పౌర్ణమి పూజలు



నరసరావుపేటలో శ్రీకళ్యాణసుందరేశ్వరుడు..



గంటావారిపాలెంలో ప్రత్యేక అలంకరణలో..



గణపవరం స్వామివారు



నాదెండ్ల శివాలయంలో దీపోత్సవం

బొల్లాపల్లి : మండలంలోని వెల్లటూరు గ్రామంలోని గంగాపార్వతీసమేత సోమేశ్వరస్వామి దేవాలయంలో కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం పౌర్ణమిని వేడుకగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై దేవాలయ ఆవరణలో సాంప్రదాయబద్ధంగా దీపాలంకరణ చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్తిక మాసంలోని కార్తిక పౌర్ణమి విశిష్టతమైందని, ఈ మాసం శివునికి ప్రీతిపాత్రమైందని ఆలయ అర్చకులు వివరించారు.

నాదెండ్ల: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శైవ క్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి దీపాలు వెలిగించి స్వామి వార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. సాతులూరులోని గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. తెల్లవారుజాము నుంచే దీపాలు వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. గణపవరం గంగాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, నాదెండ్ల గంగాపార్వతీ సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ వల్లభేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి జ్వాలా తోరణం నిర్వహించారు. వందలాది మంది భక్తులు హాజరై దర్శించుకొని స్వామి పాత్రులయ్యారు.



నాదెండ్ల శివాలయంలో జ్వాలా తోరణం

స్వామివారికి ఆభరణాల బహూకరణ

గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారికి గ్రామానికి చెందిన ఈవూరి తిరుపతి రావు, లక్ష్మీతులసి దంపతులు రూ.40 వేల వ్యయంతో వెండితో తయారు చేయించిన కళ్ళు, బొట్టు, నామాలు, చంద్రాకారం అందజేశారు.

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం, శావల్యాపురం, వేల్పూరు, పోట్లూరు, మతుకుమల్లి, కారుమంచి తదితర గ్రామాల్లో కార్తీకపౌర్ణమి వేడుకలు శుక్రవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. శివాలయాల్లో మహిళ భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

నరసరావుపేట ఈస్ట్: కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పుణ్య స్నానాలను ఆచరించి ఆలయాలకు చేరుకున్న భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. సాయంత్రం ఆలయాల వద్ద జ్వాలాతోరణం వెలిగించారు.



సాతులూరు శివాలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు



విప్పర్లలో జ్వాలా తోరణం నిర్వహిస్తున్న భక్తులు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలోని గంగా పార్వతీ సమేత మూల స్థానేశ్వరస్వామి ఆలయంలో కార్తిక పౌర్ణమి వేడుకలు కన్నుల పండువలా నిర్వహించారు. అఖండ దీపారాధన, జ్వాలాతోరణం నిర్వహించారు.